# కలెక్టర్‌ను కలిసిన బెల్లంపల్లి ఏరియా జీఎం




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:**
బెల్లంపల్లిఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎం. శ్రీరమేష్ గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరితను జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బెల్లంపల్లి ఏరియా పరిధిలోని బొగ్గు ఉత్పత్తి, కొత్త గనుల విస్తరణపై కలెక్టర్‌తో జీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీరమేష్ మాట్లాడుతూ ఏరియా అభివృద్ధిలో గోలేటి ఓపెన్ కాస్ట్ గని ఎంతో కీలకమైనదని, ప్రస్తుతం ఖైరిగుడా గని నుండి మాత్రమే ఉత్పత్తి జరుగుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొత్త గనుల ప్రారంభానికి సంబంధించి ప్రభుత్వ పరంగా రావాల్సిన వివిధ రకాల అనుమతులు వేగంగా లభించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందించాలని కోరగా, దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

# మీర్ తాహిర్ అలీ హాష్మి సదర్ ఖాజీగా ఎంపిక



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:**
ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన హఫీజ్ మీర్ తాహిర్ అలీ హాష్మిని ఆసిఫాబాద్ జిల్లా ఖాజీ నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు మీరు తాహిర్ అలీ హాష్మి తెలిపారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్, శాఖ కార్యదర్శి షఫీయుల్లా ప్రత్యేక చొరవ, ఆదేశాల మేరకు ఈ విషయమై అధికారికంగా జిఓ నంబర్ 69 (G.O.RT.NO.69) ద్వారా మే 19, 2026 మంగళవారం నాడు నియామక పత్రాన్ని జారీ చేసినట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సదర్ ఖాజీ జనాబ్ మీర్ తాహిర్ అలీ హాష్మి ఆసిఫాబాద్ మండలం, దాని పరిసర ప్రాంతాలలో నికాహ్ (వివాహాలు) జరిపించడానికి, నికాహ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ,ఇతర షరియా, చట్టపరమైన పత్రాల తయారీకి అధికారికంగా అర్హత ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఖాజీగా నియమితులైనందుకు హఫీజ్ తాహిర్ అలీ హాష్మి రాష్ట్ర మంత్రి జనాబ్ అజహరుద్దీన్, జనాబ్ షఫీయుల్లా, ప్రత్యేకంగా ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.మీర్ తాహిర్ అలీ హాష్మి ప్రభుత్వ సదర్ ఖాజీగా నియమితులవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# మర్లపాడులో ఉచిత వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :**
వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో డాక్టర్ సురేష్ రామాల ఆధ్వర్యంలో న్యూ స్టార్ చిల్డ్రన్స్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత మెడికల్ స్క్రీనింగ్ శిబిరం గురువారం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భీమిరెడ్డి లహరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు.

# మండల నూతన ఆర్ఐలకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండల రెవెన్యూ కార్యాలయంలో బదిలీపై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (ఆర్ఐలు) సాయిరాం, మమతలను మండలంలోని ఆదివాసీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలంలోని మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సంబంధిత సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించి వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన నూతన ఆర్ఐలు సాయిరాం, మమత మాట్లాడుతూ తమకు ఆత్మీయ స్వాగతం పలికిన ఆదివాసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల ప్రజలందరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆదివాసీ నాయకులు, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతాం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :**
జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం ఢిల్లీ లోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు ఈ నెల 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారం అందించి ధ్రువపత్రాలు జతచేసిన ఫారాన్ని తిరిగి తీసుకొని బి.ఎల్.ఓ. యాప్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరిగిందని, రాజకీయ పార్టీల తరఫున బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను తీసుకోవడం జరిగిందని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో 320 పోలింగ్ కేంద్రాలు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో చేపట్టి ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జమీల్, నాయబ్ తహసిల్దార్ శ్యాం లాల్, రామ్ లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో 6 కోట్ల రూపాయల అంచనాలతో నిర్మిస్తున్న జిల్లా మహిళా సమాఖ్య ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ ధర్మేందర్ లతో కలిసి సందర్శించి పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 6 కోట్ల రూపాయల అంచనాలతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. భవనానికి రంగు, విద్యుత్ సంబంధించిన పనులు, కిటికీలు, దర్వాజాలు బిగించే పనులను వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు. భవన నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, భవన నిర్మాణం గుత్తేదారు, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి భరోసా

- **బాధితులకు 20 వేల ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకుల పంపిణీ**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:**
జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో నిన్న రాత్రి జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ఈ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి పరామర్శించారు. ప్రమాద తీవ్రతను పరిశీలించి, తీవ్ర దిగ్భ్రాంతికి గురైన బాధిత కుటుంబాలను ఆమె ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే తన సొంత నిధుల నుండి తక్షణ సహాయం కింద బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తులతో పాటు రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడిన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం తరపున అందాల్సిన నష్టపరిహారం, ఇతర సహాయ సహకారాలు త్వరితగతిన అందేలా చూడాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. మున్సిపల్ యంత్రాంగం కూడా బాధితులకు అవసరమైన తదుపరి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ , మున్సిపల్ కౌన్సిలర్లు సలాం, బాలకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ



నాయకురాలు మార్సుకోల సరస్వతి, బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు జబోరే రవీందర్, బీ ఆర్ ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ నిసార్, దూడల అశోక్, సాయి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:**
జిల్లా కేంద్రంలోని దాస్నాపూర్‌లో ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో ఇండ్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ కె. హరిత ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో ఇండ్లు పూర్తిగా దె బ్బతిని తీవ్రంగా నష్టపోయిన రెండు కుటుంబాలకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం కింద రూ.95,100ల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. వీటితో పాటు ప్రమాదం కారణంగా పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్న మరొక బాధిత... కుటుంబానికి రూ.9 వేల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అగ్ని ప్రమాద తీవ్రతకు నిలువ నీడ కోల్పోయిన బాధితుల పరిస్థితిపై జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా స్పందించారని కలెక్టర్ తెలిపారు. మంత్రుల ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని హౌసింగ్ పీడీ (ప్రాజెక్ట్ డైరెక్టర్)ను ఆదేశించినట్లు ఆమె వివరించారు. ప్రమాద బాధితులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారికి అవసరమైన అన్ని రకాల నిత్యావసరాలు, సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ కె. హరిత స్పష్టం చేశారు.

# దస్నాపూర్ అగ్నిప్రమాద బాధితులకు ఆత్రం సుగుణ పరామర్శ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
పట్టణంలోని దస్నాపూర్ లో బుధవారం అర్ధ రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి నష్టపోయిన కుటుంబాలను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చి, వారికి తన వంతుగా తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ అగ్నిప్రమాద బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సహాయం త్వరగా అందేలా అధికారులతో మాట్లాడుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహియ (తరిఖ్), డైరెక్టర్ మారుతి పటేల్, కౌన్సిలర్ వైరాగడే గోవింద్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి మరియు కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు పరామర్శ



- **10, 000 ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గ్రంథాలయ చైర్మన్ అనిల్**

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: జిల్లా కేంద్రంలోని దాస్నాపూర్‌లో అగ్నిప్రమాదం జరిగి రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమైన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కాంబ్లే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు.సర్వస్వం కోల్పోయిన ఆ కుటుంబాల పరిస్థితిని చూసి చలించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గ్రంథాలయ చైర్మన్ అనిల్ వారికి తక్షణ సహాయంగా రూ. 10,000/- నగదును ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తహసిల్దార్ రియాజ్ అలీకి ఫోన్‌లో మాట్లా డి, ప్రభుత్వం నుండి బాధితులకు అందాల్సిన పరిహారం అత్యవసరంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా త్వరగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా అన్ని స్థాయిల్లో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ లు గోవింద్, కార్తీక్, సాయి, వార్డు సభ్యులు జావిద్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్లా , రాజేందర్, నిఖిల్, కొండు సాయి, బండి సాయి, జమీర్ అహ్మద్, ఇస్మాయిల్ , బబ్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై మోపిన అధిక ధరల భారాన్ని ఉపసంహరించుకోవాలి



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ప్రజలపై మోపిన అధిక ధరల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంసీపీఐ(యు) హన్మకొండ జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంసారెడ్డి డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు) జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం హన్మకొండ ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారి సుభాషిణికి పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా దేశంలోని రైతులు, కార్మికులు, ఆదివాసీలు, నిరుద్యోగ యువత తీవ్ర సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్, సహజ వాయువు, ఎరువుల ధరల పెంపుతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. అమెరికాతో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం నుంచి వ్యవసాయ, పాడి, పండ్లు, కూరగాయల ఉత్పత్తులను మినహాయించాలని, డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సి-2 వ్యయంపై 50శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పీకి చట్టబద్ధ హోదా కల్పించి, దానికంటే తక్కువ ధరకు కొనుగోలు చేయడాన్ని శిక్షార్హ నేరంగా పరిగణించాలని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, 60 సంవత్సరాలు దాటిన రైతులు, కార్మికులకు నెలకు రూ.20వేల సామాజిక భద్రతా పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. మహిళలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టి దోషులకు కఠిన శిక్షలు విధించాలని, ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ మూల్యాంకన కుంభకోణాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాసు సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, అన్నపోయిన ప్రేమలత, పట్టడం మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అమాయక రైతులను లక్ష్యంగా చేసుకుని రుణాలు, సబ్సిడీలు, వ్యవసాయ పరికరాలు, పంటల కొనుగోలు పేరుతో మోసాలకు పాల్పడుతున్న దళారులు, కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో రైతుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు గత ఏడాది కాలంలో రైతులను మోసం చేసిన వ్యక్తులపై మొత్తం 25 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈయేడాదిలో రైతుల మోసాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టగా, కేవలం నెల రోజుల వ్యవధిలోనే 20 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వ్యవసాయ రుణాలు ఇప్పిస్తామని, ప్రభుత్వ సబ్సిడీలు మంజూరు చేయిస్తామని, ట్రాక్టర్లు వ్యవసాయ యంత్రాలు తక్కువ ధరకే అందిస్తామని, పంటలకు అధిక ధరలు ఇప్పిస్తామని నమ్మించి ముందస్తుగా డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు, ఇతర సంస్థల పేర్లతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే పూర్తిస్థాయిలో ధృవీకరించుకున్న తర్వాతే స్పందించాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, మోసాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. రైతుల కష్టార్జిత డబ్బును మోసపూరిత పద్ధతుల్లో దోచుకునే వారి పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా రైతులతో పాటు సాధారణ ప్రజలు కూడా తమ సమస్యలను నిర్భయంగా పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతుల ఆర్థిక భద్రతకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లతో నెరవేరిన పేదల ఆశయం

## ఎమ్మెల్యే రాగమయి దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పేదల ఆశయం నెరవేరిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలంలోని కరాలపాడు గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గూడా దీపిక– రవి దంపతుల నూతన ఇందిరమ్మ గృహ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది నిరుపేద కుటుంబాలు శాశ్వత గృహ సౌకర్యాన్ని పొందుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన ఓబురెడ్డి భద్రరెడ్డి కుమార్తె ఓనిల అలంకరణ కార్యక్రమం సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కరాలపాడు గ్రామ సర్పంచ్ కనికంటి తేజశ్రీ, కాంగ్రెస్ నాయకుడు ఆళ్ల నరేంద్ర, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్, టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి, చీకటి రామారావు, ఖమ్మం జిల్లా నాయకురాలు బుక్క కృష్ణవేణి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ బడా బాబులకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం

- వరంగల్ ఆర్డీఓకు ఎంసీపీఐ(యు) వినతి



**ఉద్యమ కెరటం, వరంగల్:** కార్పొరేట్ బడా బాబులకు మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందని ఎంసీపీఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి అన్నారు. ఎంసీపీఐ(యు) జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం వరంగల్ ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారి ఫణికుమార్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభించడంతో ప్రజలు, రైతులు, కార్మికులు, ఆదివాసీలు తీవ్ర సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, సహజ వాయువు, ఎరువుల ధరల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు మేరకు సి-2 వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి కనీస ఎంఎస్పీ ప్రకటించాలని, ఎంఎస్పీకి చట్టబద్ధ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మహిళలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టి దోషులకు కఠిన శిక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాసు సావిత్రి, పార్టీ సభ్యులు జెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతోనే వార్డుల సమగ్ర అభివృద్ధి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక" ద్వారా పట్టణాల్లోని ప్రతి వార్డు సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇందులో భాగంగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్ కాలనీలో నిర్వహించిన వార్డు సభకు మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, అంతర్గత రహదారులు, పారిశుధ్య సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజల సహకారంతోనే వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతుల కుమార్తె బండారి అమితకు కలెక్టర్ రాజర్షిషా ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వార్డు ప్రత్యేక అధికారి నిహారిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేసి ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అదనపు కలెక్టర్ ఛాంబర్లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి ఎస్డబ్ల్యూసీ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ట్యాబ్ ఎంట్రీలు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు, నమోదు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎస్సీ, ఏసీఎస్ఓ, డీసీఓ, డీపీఎం, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### నూతన డీఈఓను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాబోయే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా నాయకులు కోరారు. ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మాధవిని గురువారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య అధికంగా పాఠశాలలకు ప్రాధాన్యతనిస్తే ఉపాధ్యాయుల కొరత నివారించబడి విద్యాబోధన సజావుగా కొనసాగుతుందని డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె జిల్లాలో విద్యా ప్రమాణాల పెంపుదలకు ఉపాధ్యాయ సంఘాలన్ని సమన్వయంతో పనిచేయాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ప్రతి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రా నవీన్ యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కనక అభిమాన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విఠల్ గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.బాబన్న, జిల్లా కోశాధికారి ముజీబ్, జాదవ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దిగ్విజయంగా 'రూ.5కే భోజనం'

### చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ని సన్మానించిన ఇస్కాన్ ప్రతినిధులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు, కూలీల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రారంభించిన 'రూ.5కే మధ్యాహ్న భోజనం' పథకం విజయవంతంగా కొనసాగుతోంది. మార్కెట్ కమిటీ సౌజన్యంతో, ఇస్కాన్ సొసైటీ సహకారంతో గత నెల 18న ప్రారంభమైన ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు, కూలీలు తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందుకుంటూ ఈ సదుపాయాన్ని పెద్దఎత్తున వినియోగించుకుంటున్నారు. కార్యక్రమం అమలును పరిశీలించేందుకు ఇస్కాన్ సొసైటీ ప్రతినిధి ప్రభువు ప్రణవానంద్ దాస్ గురువారం మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులకు పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందిస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డితో పాటు మార్కెట్ కమిటీ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్ శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది, ఇస్కాన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పోడు రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి


### పీసీసీఎఫ్కు వినతిపత్రం అందజేసిన ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ నియోజకవర్గంలోని పోడు రైతుల సమస్యలను పరిష్కరించి, అటవీ శాఖ అధికారులకు, రైతులకు మధ్య నెలకొన్న వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన పోడు రైతులతో కలిసి హైదరాబాద్లోని అరణ్య భవన్లో పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్)ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలు, సాగు హక్కులు, అటవీ శాఖ అధికారులతో ఏర్పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూముల విషయంలో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, అటవీ శాఖ–రైతుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించి వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రైతుల జీవనోపాధికి భంగం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన పోడు రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువకుడిని పరామర్శించిన సర్పంచ్ ఆడే శీల

### రిమ్స్లో చికిత్స పొందుతున్న సయ్యద్ ఆఖిబ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుడిహత్నూర్కు చెందిన సయ్యద్ జాఫర్ కుమారుడు సయ్యద్ ఆఖిబ్ను గుడిహత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడే శీల గురువారం పరామర్శించారు. రిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన ఆమె బాధిత యువకుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులను కలిసి ఆఖిబ్ త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జై సింగ్ను కలిసి బాధితుడికి ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందించాలని విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. మండల ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ ఉన్నత వైద్య సేవలు అందిస్తున్న రిమ్స్ డైరెక్టర్కు సర్పంచ్ ఆడే శీల, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ససానే మాధవ్, డాక్టర్ కైలాస్, గుడిహత్నూర్ మండల ఎంఐఎం అధ్యక్షుడు అర్షద్ ఖురేషి, కాంగ్రెస్ యువ నాయకుడు ఆడే క్రాంతి కుమార్ తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటి వాటిని సంరక్షించండి




**ఉద్యమ కెరటం, తాండూర్:** మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూప అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేడు నాటిన మొక్కలే భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగి మానవాళికి అవసరమైన ఆక్సిజన్ను అందిస్తాయని తెలిపారు. వృక్ష సంపద పెరిగితే వాతావరణ సమతుల్యత నెలకొని సకాలంలో వర్షాలు కురుస్తాయని, దాంతో పాడి, పంటలు సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.రమాదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్పై వీడియో కాన్ఫరెన్స్

### ప్రత్యేక శిక్షణలో పాల్గొన్న జిల్లా అధికారులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ట్రైనింగ్ ఆన్ ఎస్ఐఆర్' ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన వివిధ కీలక దశలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రారంభ దశలో చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలు, ప్రణాళికల రూపకల్పనకు సంబంధించిన ప్రీ-ఎస్ఐఆర్, నివేదికల తయారీకి ముందు అవసరమైన సాంకేతిక అంశాలు, ప్రీ-డ్రాఫ్ట్, డ్రాఫ్ట్, పోస్ట్-డ్రాఫ్ట్ దశల్లో అనుసరించాల్సిన విధానాలపై శిక్షకులు వివరించారు. అలాగే నివేదికల సమర్పణ, వివిధ దశల్లో చేపట్టాల్సిన కార్యాచరణలను ఎలాంటి లోపాలు లేకుండా, పూర్తి పారదర్శకతతో అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.


## గ్రామాల్లో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' గ్రామ సభలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో నేరడిగొండ, వడూర్ గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' గ్రామ సభలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించిన అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన వారు తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను సమీక్షించడంతో పాటు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారాలు చూపించడం ద్వారా గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేశసేవలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

### అగ్నివీర్ విజేతలకు కలెక్టర్ రాజర్షిషా సన్మానం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** దేశసేవ చేయాలనే లక్ష్యంతో అగ్నివీర్ పోస్టులకు ఎంపికైన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆరుగురు యువకులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైన సాయిశివ, బౌనే అన్వేష్, సునీల్ సింగ్, సృజన్, షేక్ ఇర్ఫాన్, వర్ధన్లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంకితభావం, క్రమశిక్షణతో దేశానికి సేవ చేస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మిగతా యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, శిక్షణ ఇచ్చిన గురువులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల యువతను గుర్తించి వారికి సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించి అగ్నివీర్లుగా తీర్చిదిద్దిన వీజీఎస్ అకాడమీ ఛైర్మన్ రాకేశ్, జ్యోతీశ్వరన్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ క్రీడా అధికారి పార్థసారథి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పి.రాజేష్, ఫిజికల్ డైరెక్టర్లు సౌమ్య, రవి, అగ్నివీర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం హాజీపూర్ మండలం రాపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 4, 6, 8, 10 తేదీల్లో ప్రత్యేక గ్రామ, డివిజన్, వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందునా రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. యూరియా పంపిణీ యాప్లో నమోదు చేసిన రైతుల పంట వివరాల ఆధారంగా విడతల వారీగా జరుగుతుందని తెలిపారు. ఒకే పంటను నిరంతరం సాగు చేయడంతో భూసారం తగ్గిపోతుందని, ప్రత్యామ్నాయ పంటలు, నానో యూరియా, డీఏపీ వినియోగంతో పాటు ప్రభుత్వ ధృవీకరించిన విత్తనాలనే ఉపయోగించాలని రైతులకు సూచించారు. చిన్న, సన్నకారు రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పత్తి సాగులో ఎకరానికి 14 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందని, రైతులకు మద్దతు ధర అందిస్తామని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా కొనసాగుతున్నందున జిల్లాలో ఇప్పటివరకు డెంగ్యూ కేసులు నమోదు కాలేదని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కంపోస్టుగా మార్చి రైతులకు అందించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ, జనగణన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాలల్లో బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలు అమలు చేస్తున్నామని, ఈ ఏడాది 98 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. తాగునీరు, వైద్యం, విద్య, మహిళా రక్షణ, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు. ప్రజలు తమ సమస్యలను స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలని, టోల్ఫ్రీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

- పంట వ్యర్థాలు తగలబెడితే జరిమానా తప్పదు
- మండల వ్యవసాయ అధికారి రమేష్ భగత్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ భగత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గోండ్ హర్కాపూర్ గ్రామసభలో ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభల ద్వారా రైతులకు ఖరీఫ్ సీజన్లో అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట వ్యర్థాలను తగలబెట్టడంతో నేలలోని సేంద్రీయ కార్బనం నశించి భూసారం తగ్గిపోతుందని తెలిపారు. పంట అవశేషాలను భూమిలోనే కలియదున్నడం ద్వారా భూసారం పెరిగి పంట దిగుబడులు మెరుగుపడతాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం పంట వ్యర్థాలను తగలబెట్టిన రైతులకు రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమైతే రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. జూన్ 15 తర్వాత పత్తి సాగుకు బదులుగా పెసర, మినుములు, కంది, టమాటా, బెండ, ఆకుకూరలు వంటి పంటలను సాగు చేయడం ప్రయోజనకరమని సూచించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు, నిషేధిత హెచ్టీబీటీ పత్తి విత్తనాల విక్రయాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అలాంటి సమాచారాన్ని వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కేవలం లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, పంట కాలం పూర్తయ్యే వరకు విత్తనాల ప్యాకెట్లు, నగదు రశీదులను భద్రపర్చుకోవాలని అన్నారు. ఫెర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను ముందస్తుగా బుక్ చేసుకోవడం ద్వారా సకాలంలో ఎరువులు పొందవచ్చని తెలిపారు. సాంప్రదాయ యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియాను ఉపయోగించాలని పేర్కొన్నారు. నానో యూరియా తక్కువ పరిమాణంలో ఎక్కువ ప్రభావం చూపడంతో పాటు భూసారాన్ని పెంచి చీడపీడల ఉధృతిని తగ్గిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయిరాం, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామసభ సమాచారంలో నిర్లక్ష్యం..?

### సరండి గ్రామస్థుల్లో అసంతృప్తి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామసభ తీరుపై గ్రామస్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రామసభకు సంబంధించిన సమాచారాన్ని గ్రామంలోని ప్రతిఒక్కరికీ చేరవేయకుండా కేవలం కొంత మందికే తెలియజేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామసభ అనేది గ్రామాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారం, లబ్ధిదారుల ఎంపిక వంటి కీలక అంశాలపై చర్చించే ముఖ్యమైన వేదిక. అలాంటి సమావేశాలకు గ్రామంలోని ప్రతి కుటుంబానికి సమాచారం అందేలా చూడటం గ్రామపంచాయతీ అధికారుల బాధ్యతగా భావిస్తారు. అయితే ఈసారి ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేదని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నూతనంగా విధుల్లోకి వచ్చిన కార్యదర్శి గ్రామసభ సమాచారాన్ని డప్పు చాటింపు, మైక్ ప్రకటనలు, వార్డు సభ్యుల ద్వారా సమాచారం పంపించడం వంటి సాధారణ ప్రచార పద్ధతులను వినియోగించలేదని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో అనేక మంది గ్రామస్థులు సమావేశానికి హాజరు కాలేకపోయారని, తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపికలో పారదర్శకతపై ఇప్పటికే ప్రజల్లో అనుమానాలు ఉన్న నేపథ్యంలో గ్రామసభ సమాచారం కూడా అందరికీ చేరకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, అర్హులైన లబ్ధిదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని కోల్పోయారని గ్రామస్థులు అంటున్నారు. గ్రామ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే వేదికలైన గ్రామసభల్లో ప్రతిఒక్కరికీ సమాన అవకాశం కల్పించాలని, భవిష్యత్తులో సమావేశాల తేదీ, సమయం, స్థలం వివరాలను ముందుగానే గ్రామమంతటా విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గ్రామసభలకు సంబంధించిన హాజరు వివరాలు, చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక లక్ష్యాలు క్షేత్రస్థాయిలో ఫలించాలంటే గ్రామసభల నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని, ఈ అంశంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామసభలు నిజమైన ప్రజాస్వామ్య వేదికలుగా నిలవాలంటే సమాచారం అందరికీ చేరడం, ప్రతి గ్రామస్థుడికి పాల్గొనే అవకాశం కల్పించడం అత్యవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## సింగరేణి భూముల సర్వే రగడ

- లంకపల్లిలో సర్వేను అడ్డుకున్న రైతులు
- పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామంలో 30 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి సింగరేణి సంస్థ చేపట్టిన సర్వే వివాదానికి దారితీసింది. సర్వే నిర్వహించేందుకు వచ్చిన అధికారులను స్థానిక రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో సింగరేణి ప్రాజెక్టుల కారణంగా ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కోసం ఈ భూమిని గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెవెన్యూ సర్వేయర్ గురువారం లంకపల్లి గ్రామంలో భూముల సర్వే చేపట్టగా, రైతులు అక్కడికి చేరుకుని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు తరతరాలుగా ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాయని, అలాంటి భూములను వేరే మండలానికి చెందిన వారికి కేటాయించడం అన్యాయమని రైతులు పేర్కొన్నారు. భూములపై తమకే హక్కులు ఉన్నాయని, ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్నందున తమ పేర్లపై పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించకుండా సర్వే చేపట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సర్వే పనులను నిలిపివేశారు. తమ జీవనాధారమైన భూములను కోల్పోతే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. రైతుల నిరసనతో సర్వే ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది.



## యాదవ జాతి సమగ్ర అభివృద్ధికి కృషి



- రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్
- యాదవ సంఘం రాష్ట్ర, మండల నాయకులకు ఘన సన్మానం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** యాదవ జాతి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్ అన్నారు. గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామంలో యాదవ సంఘం రాష్ట్ర, మండల నాయకులకు గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముస్తఫానగర్ గ్రామానికి చెందిన రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్ తో పాటు గంభీరావుపేట మండల యాదవ సంఘం అధ్యక్షుడు దోమకొండ కృష్ణకాంత్ యాదవ్లను గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ముస్తఫానగర్ యాదవ సంఘం అధ్యక్షుడు కంటే వెంకటి నేతృత్వంలో సంఘ సభ్యులు నాయకులకు శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాదవ జాతి సమగ్ర అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి సంఘం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంటే స్వామి, సుద్దాల రాజయ్య, సత్తయ్య, దోమకొండ మల్లేష్, హనుమయ్య, రాజలింగం, దోమకొండ శేఖర్, కొక్కు రాజయ్య, మధు, దేవేందర్, మారబోయిన కృష్ణమూర్తి, బాబు, శ్రీనివాస్, తిరుపతి, దేవయ్య, వెంకటి, లింగం, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

